## కేజీబీవీని సందర్శించిన డీఈవో

కొందుర్గు, ఏప్రిల్ 2: కొందుర్గు మండలంలోని కేజీబీవీలో ఎలుకలు విద్యార్థినులను గాయపరిచిన విషయాన్ని తెలుసుకున్న రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యం విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో ఎలుకల నివారణకోసం తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌వోను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీడీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఎంఈవో గాయత్రిదేవి, ఎంపీడీవో అనురాధ పాల్గొన్నారు.

## దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆమనగల్లు, ఏప్రిల్ 2: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువును ఏప్రిల్ 14 వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని అర్హులైన వారందరూ మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ తెలిపారు. ఈ పథకంపై సందేహాలు నివృత్తి కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం



మంచాల, ఏప్రిల్ 2: మండల పరిధిలోని అస్మత్‌పూర్ పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన ప్రియదర్శిని బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ జంగయ్య, గ్రామస్తులు వెంకటేశ్, పర్వతాలు, పద్మమ్మ ఆమెను సన్మానించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



బాధితుడితో మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

కేశంపేట, ఏప్రిల్ 2: కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని కిరాణా దుకాణంలో మంటలు చెలరేగిన ఘటనలో బాధిత కుటుంబాన్ని బుధవారం ఆర్యవైశ్య మహాసభ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. కొండారెడ్డిపల్లికి చెందిన కృష్ణ కొన్నేళ్లుగా కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం షాట్ సర్క్యూట్ సంభవించి దుకాణంలోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతై రూ.1.50లక్షల ఆర్థిక నష్టం జరిగిందన్నారు. అతడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కేశంపేట అధ్యక్షుడు శ్రీనివాస్, దయానంద్, శ్రీనివాస్, లక్ష్మయ్య, జగన్, రాములు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 2 : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి గణేశ్ నగర్ కాలనీకి చెందిన వడ్డె లక్ష్మమ్మ (70) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో శంకర్‌పల్లిలోని చేపల మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా, బొలెరో వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ వడ్డె లక్ష్మమ్మను ఢీకొట్టగా చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. లక్ష్మమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రౌడీ షీటర్లకు ఏసీపీ కౌన్సిలింగ్

పహాడిషరీఫ్, ఏప్రిల్ 2: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం డివిజన్ ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏసీపీ బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీట్ కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీసులు డేగ కన్నుతో నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎక్కడైనా సామాన్యులకు ఇబ్బంది కలిగించినట్లు ఫిర్యాదు అందితే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఏసీపీ హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. నేర నివారణకు పోలీసులతో సహకరించాలని సూచించారు.

## ఎల్ ఆర్ఎస్ గడువు పొడిగింపు

కేశంపేట, ఏప్రిల్ 2: అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25శాతం రాయితీతో మార్చి 31వరకు గడువు ఉండేదని, ఈ విషయమై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ స్పందించి ఏప్రిల్ 30వరకు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఫీజు చెల్లించనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 25శాతం రాయితీ పొందాలని కోరారు.

## రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 2: ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని ఈ నెల 30వరకు ప్రభుత్వం పొడిగించడం జరిగిందని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్ 25శాతం రాయితీ అవకాశాన్ని షాద్‌నగర్ పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్**



మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో పాపన్నగౌడ్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

మొయినాబాద్, మార్చి 2: దళిత, బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపించిన వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అదే విధంగా సురంగల్ గ్రామంలో సురంగల్ గౌడ సంఘం అధ్యక్షుడు అశోక్‌గౌడ్, గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి యువజన విభాగం మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళిత, బహుజనులను ఏకం చేయడానికి ఎంతో కృషి చేసి బహుజన రాజ్యం వైపు నడిపించిన వ్యక్తి పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరాంనగర్ గౌడ కుల సంఘం అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, ఎన్కేపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు రాఘువేందర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, శివయ్యగౌడ్, దర్శన్‌గౌడ్, ఎట్టయ్యగౌడ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాజుగౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

**పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం**

కేశంపేట : బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్‌గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి నుంచి షాద్‌నగర్‌కు తరలివెళ్లి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బహుజన రాజ్యాధికారంకోసం పీడిత వర్గాల పక్షాన పోరాడిన ధీరుడని, ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్, మహేశ్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, అభిలాష్‌గౌడ్, రఘుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, సందీప్‌గౌడ్, వంశీగౌడ్, కార్తీక్‌గౌడ్ పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీగౌడ్ ఆధ్వర్యంలో కాటమయ్య దేవస్థాన ఆవరణలో ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగారవి, పట్టణ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాఘువేందర్ గౌడ్, నాయకులు అల్లాజీ, నర్సింహ, శివ, వెంకటేశ్, అంజి, సాయి, మనోజ్ ఉన్నారు.

**సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి**

కడ్తాల్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు బాలకుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, యువజన ఉపాధ్యక్షుడు రవి గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌గౌడ్, నాయకులు విష్ణుగౌడ్, గణేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్‌గౌడ్, శ్రీశైలం గౌడ్, ప్రదీప్‌గౌడ్, అనిల్, జంగయ్య, కృష్ణ, నరేందర్ గౌడ్, పాండు, లక్ష్మీకాంత్ గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, రాజు గౌడ్, మధుగౌడ్, అల్లాజీగౌడ్ పాల్గొన్నారు.



షాద్‌నగర్ పట్టణంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యువజన సంఘం నాయకులు

**షాద్‌నగర్‌టౌన్ :** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి బుధవారం గౌడ యువజన సంఘం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, అభిలాష్ గౌడ్, మహేష్‌గౌడ్, రఘుగౌడ్, సందీప్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, రఘుగౌడ్, వంశీగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, ఉదయ్‌గౌడ్ పాల్గొన్నారు.

**పోరాట యోధుడు పాపన్నగౌడ్**

చేవెళ్ల రూరల్ : గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని శంకర్‌పల్లి పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని కల్లు దుకాణం ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శంకర్‌పల్లి పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, సంఘం సభ్యులు



కడ్తాల్: మండల కేంద్రంలో నిర్వహించిన సర్వాయి పాపన్న వర్ధంతిలో పాల్గొన్న నాయకులు



ఆమనగల్లులో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీగౌడ్, చిత్రంలో ఉపాధ్యక్షుడు గంగారవి



సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొండారెడ్డిపల్లి గ్రామస్తులు




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ వరప్రసాద్

## మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కడ్తాల్, ఏప్రిల్ 2: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఎస్ఐ వరప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమణ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా తదితర అంశాలపై.. వీవోఏ, వీవో-వోబీల అధ్యక్షులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా సైబర్ ట్రాఫికింగ్ ద్వారా జరుగుతుందని, సెల్‌ఫోన్లలో వచ్చే రకరకాల యాప్‌లతో లైంగిక వ్యాపారానికి గురికావడం, కొందరు ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసి వేధించడం జరుగుతుందని తెలిపారు. అనవసర యాప్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. యువత సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని, వారి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజేశ్వరి, సీసీలు వసంత, జరీనా, రాములు, నర్సింహ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలి



మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారుల ధర్నా

మంచాల, ఏప్రిల్ 3: ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇండ్లు ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య అన్నారు. మండల పరిధిలోని లింగంపల్లి, మంచాల, నోముల గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, మైనార్టీలకు ల్యాటరీ పద్ధతి ద్వారా 90మందికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించినప్పటికీ వాటిని పంపిణీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ బుధవారం మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఒక్కో గ్రామానికి 30చొప్పున 90 ఇండ్లను వారికి కేటాయించిందని, వెంటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మార బుగ్గరాములు, పల్నాటి సుధాకర్, బాల్‌రాజ్, రమేష్, భాను, షభానా, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ హత్యపై సీబీఐతో విచారణ జరిపించాలి




ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 : పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇబ్రహీంపట్నంలో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ.. ప్రవీణ్ పగడాల మరణం సాధారణమైంది కాదని, ఇది ముమ్మాటికీ హత్యేనన్నారు. ఆయన మరణించి ఇన్నిరోజులు కావస్తున్నా ఇంతవరకూ పోస్టుమార్టం రిపోర్టు రాలేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలక ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కొంతకాలం నుంచి ఆయనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ప్రవీణ్ పగడాల సీబీఐ విచారణ జరిపించాలని, నిజనిజాలు బయట పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు దినకర్, రాజు, దేవకుమార్, ప్రకాశ్, కరుణాకర్, రవికుమార్, సంజీవ, అజయ్, భైరాజ్, జయకుమార్ పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేయాలి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 2 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 82వ రోజుకు చేరాయి. బుధవారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. మా భూములు మాకు తిరిగి అప్పగించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. దీక్షలో పి.లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్ రెడ్డి, గోపి, సోనిబాయి, వసుంధర, తులసి, గోమా, మున్న, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, వెంకటయ్య, శాంతయ్య, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మల్రివాగు రాజు, తండా వాసులు, తదితరులు పాల్గొన్నారు.


## పశువులకు బీమా తప్పనిసరి




సహకార సంఘం కార్యాలయంలో బీమా చెక్కు అందజేస్తున్న చైర్మన్ శేఖర్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 2: రైతులు తమ పాడి పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని షాబాద్ సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన ఓ రైతు పాడి ఆవు ఇటీవల చనిపోవడంతో బీమా కంపెనీ నుంచి వచ్చిన రూ.95వేల డబ్బుల చెక్కును బుధవారం సహకార సంఘం కార్యాలయంలో రైతుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు తమ పాడి పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు పశువు మృతి చెందితే బీమా డబ్బులు అందించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఈవో శివకుమార్ రెడ్డి, డైరెక్టర్ రామచందర్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



కేశంపేట, ఏప్రిల్ 2: సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి బుధవారం లబ్ధిదారురాలి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కేశంపేట మండలంలోని లింగంధన గ్రామానికి చెందిన నెల్లికంటి బాలమ్మ గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుందని, ఆమె మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.45వేలు చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో వెంకట్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్.కృష్ణ, ఇస్తారి పాల్గొన్నారు.

## దిగజారుడు రాజకీయాలు సిగ్గుచేటు

**• వనస్థలిపురం కార్పొరేటర్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ధ్వజం**



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్ తదితరులు

వనస్థలిపురం, ఏప్రిల్ 2 : పూర్తయిన పనులను ప్రారంభించకుండా కార్పొరేటర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పీఏ కార్పొరేటర్‌కు ఫోన్ చేసి పనులను ప్రారంభిద్దామని చెప్పినా కార్పొ రేటర్ మేయర్, ఇన్‌చార్జి మంత్రితో ప్రారంభిస్తామని తెలిపారని అన్నారు. ఎమ్మెల్యే పనులను ప్రారంభించవద్దన్న కుట్రతో మంత్రిని అడ్డుపెట్టుకుని డ్రామాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. అభివృద్ధికి చిరునామా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అని ఎల్బీనగర్‌లో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. కార్పొరేటర్ ఇంటి ముందు పార్కు, సీనియర్ సిటిజన్ భవనం, కమ్యూనిటీ హాల్, రహదారులన్నీ ఎమ్మెల్యే చేయించనవనే విషయం మరిచా రా? అని ప్రశ్నించారు. దిక్కుమాలిన రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధికోసం పనిచేయాలని హితవు పలికారు. స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. తీరు మారకుంటే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రామ్మోహన్, రాంబాబు పాల్గొన్నారు.



కడ్తాల్ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష ముగిసిన అనంతరం విద్యార్థుల కేరింతలు

# ముగిసిన 'పది' పరీక్షలు

కడ్తాల్, ఏప్రిల్ 2: మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతోపాటు, ముద్విన్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష ఆఖరి రోజు మొత్తం 526 మంది విద్యార్థులగానూ అందరూ హాజరైనట్లు ఎంఈవో సత్యనారాయణ, సీఎస్‌లు చందులాల్, ఝాన్సీలక్ష్మి, కృష్ణయ్య, డిపార్ట్‌మెంట్ అధికారులు రాధాకృష్ణారెడ్డి, వెంకటరమణ రెడ్డి, విష్ణుమూర్తి తెలిపారు. పరీక్షలు చివరి రోజు కావడంతో విద్యార్థులు కేరింతలు వేశారు.

కేశంపేట : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షలు కేశంపేట మండలంలో బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. కేశంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 190మంది విద్యార్థులు వశిష్ఠ పాఠశాలలో 178, కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 180మంది పరీక్షలు రాశారని, మండలంలోని 16పాఠశాలలకు చెందిన 548మంది విద్యార్థులకు అందరు హాజరైనట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా సీఐ నరహరి పర్యవేక్షణలో ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



## తాగునీటి సమస్య లేకుండా చూడండి

బండ్లగూడ, ఏప్రిల్ 2: బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు అన్నారు. బుధవారం గంధంగూడ వాసులతో కలిసి జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బండ్లగూడలో నీటి సమస్య మరింత పెరిగిందన్నారు. జంట జలాశయాలలో ఒకటైన హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందించి కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్యను పరిష్కరిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. నేడు నీటి ఎద్దడిని నివారించలేకపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి వనరులను పెంచి వేసవికాలంలో సైతం నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్న ఘనత తమదే అన్నారు. హిమాయత్ సాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రింటర్ల ద్వారా కొంతమేర నీటిని అందించినప్పటికీ ఆ నీరు ఏ మూలాన సరిపోకపోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సామర్థ్యాన్ని పెంచి బండగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని కాలనీలో గ్రామాలకు రోజు విడిచి రోజు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

వ్యవసాయ యూనివర్సిటీ : తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీలో బిల్లు పెట్టినా, పార్లమెంట్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు సమావేశాలు రెండు రోజులు ఉండగానే బిల్లు పెట్టకపోవడంతో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీల మహాధర్నా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘాల అధ్యక్షులతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ బీసీ ఉద్యోగులు భిక్షపతి, అధ్యక్షులు కృష్ణ రజినీకాంత్ కె కిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్నారు.

